క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'దియ్యన'



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దియ్యన

ఆలమూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా మండలంలోని చొప్పెల్లకు చెందిన దియ్యన పెదకాపు నియమితులయ్యారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సూచనల మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర యువజన విభాగంలో ఆలమూరు మండలానికి చోటు దక్కడంపై పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర స్థాయి పదవిలో నియమించిన రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలుసుకుని ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దియ్యన ఆదివారం పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలియజేశారు.

బీబీ ఫాతెమా జహేరాకు ఘన నివాళి

మామిడికుదురు: ఇస్లాం మత వ్యవస్థాపకుడు, మహ్మద్ ప్రవక్త తనయురాలు బీబీ ఫాతెమా జహేరా షహదత్ మజ్లిస్ ఆదివారం పాశర్లపూడి దర్గా వద్ద ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది ముస్లింలు దర్గా వద్ద జరిగిన మజ్లిస్‌లో పాల్గొన్నారు. రాష్ట్రంలోని ఏకైక దర్గాగా ప్రాచుర్యం పొందిన దర్గా వద్ద భారీగా కార్యక్రమాలు నిర్వహించారు. కేవలం మహిళలకు మాత్రమే ఈ దర్గా గర్భగుడిలోకి ప్రవేశం ఉంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ముస్లింలు ఈ దర్గాకు వచ్చి షహదత్‌లో పాల్గొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన మహిళలతో దర్గా కోలాహలంగా మారింది. దర్గాను దర్శించుకున్న మహిళలు ముడుపులు, మొక్కులు చెల్లించారు. భక్తులకు స్థానిక ముస్లింలు అన్న సమారాధనతో పాటు ఇతర వసతి ఏర్పాట్లు చేశాయి.

ఎక్సలెన్సీ అవార్డు గ్రహీతలకు అభినందనలు

రావులపాలెం: రాష్ట్ర స్థాయి ఎక్సలెన్సీ అవార్డులు పొందిన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ, ఉపాధ్యాయిని రజిని, విద్యార్థిని సూర్య తేజస్వినిలను కళాశాల సిబ్బంది, సహచర అధ్యాపకులు, విద్యార్థులు ఆదివారం అభినందించారు. ఈనెల 16న అనంతపురంలో జరిగిన అకడమిక్ ఫెస్టివల్ అవార్డుల ప్రదానంలో స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చప్పిడి కృష్ణ రాష్ట్రస్థాయి ఎక్సలెన్సీ అవార్డు, కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకురాలు కె.రజిని రాష్ట్ర స్థాయి అవార్డు, విద్యార్థిని సూర్య తేజస్వినికి రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందుకున్న వారికి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

గ్రామోత్సవంతో ధనుర్మాసం ప్రారంభం

మామిడికుదురు: మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో ఆదివారం తీర్థపు బిందెతో గ్రామోత్సవంతో ధనుర్మాస మహోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. దీనిలో భాగంగా స్వామి వారి సన్నిధిలో కొలువు దీరిన ఆండాళ్‌తాయర్ (గోదాదేవి)కి ఘనంగా ధనుర్మాస పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా మేళతాళాలు, తీర్థపు బిందెతో తెల్లవారుజామున 'తిరుప్పావై' సేవాకాలం నిర్వహించారు. నిత్యార్చన, సేవాకాలం, నివేదన, నిత్య హోమం, బలిహరణ, మంగళాశాసనం, తీర్థ ప్రసాద వినియోగం, గోష్ఠి, తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ ఆధ్వర్యంలో దేవస్థానం ఈవో జి.మాధవి పర్యవేక్షణలో ధనుర్మాస పూజలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం/అయినవిల్లి: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరాలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవకు బదులు స్వామికి తీర్థ బిందు గౌతమీ జలాలు తీసుకొచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తిరుప్పావై ప్రవచనాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. వచ్చే నెల 14 వరకు ధనుర్మాస ఉత్సవాలు జరుగుతాయని ఈవో తెలిపారు. అలాగే ర్యాలి, అయినవిల్లి ఆలయాల్లో తీర్థ బిందె జలాల అభిసేకానంతరం ధనుర్మాస పూజలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

గ్రూప్స్ పరీక్షకు మాక్ టెస్ట్

అంబాజీపేట: గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలకు సంబంధించి అంబాజీపేట మండల ప్రజా పరిషత హైస్కూల్‌లో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు మాక్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘ అధ్యక్షుడు నందిక వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మాక్ టెస్ట్‌కు సంబంధించి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు ఆధ్వర్యంలో శ్రీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోకా రమాదేవి సౌజన్యంతో మాక్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. మాక్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. 100 మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి ఏర్పాట్లు పూర్తి

- ముస్తాబైన ఆలయాలు
- గ్రామాల్లో కోలాహలం



మాచవరంలో బారికేడ్లను ఏర్పాటు చేయిస్తున్న ఆలయ నిర్వాహకులు



బి.దొడ్డవరం ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అంబాజీపేట: సుబ్రహ్మణేశ్వరస్వామి షష్ఠి తీర్థాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు భక్తులు సహకరించాలని ఆలయ ధర్మకర్త గోకవరపు సత్యనారాయణమూర్తి, సత్తిపండురాజు, సాయి, ప్రభాకర్‌లు కోరారు. మాచవరంలో వేంచేసిన వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామి ఏర్పాట్లను, బారికేడ్లను ధర్మకర్తల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆదివారం రాత్రి స్వామి కల్యాణం ఘనంగా జరిపారు. సోమవారం తీర్థం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మాచవరం శివారు కోఠివారి అగ్రహారం, పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో వేంచేసిన సుబ్రహ్మణేశ్వరస్వామికి షష్ఠి మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొత్తపేట: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి క్షేత్రాల్లో షష్ఠి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వాడపాలెం, కొత్తపేట వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి క్షేత్రాల్లో ఆదివారం రాత్రి నుంచి వివిధ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీల సభ్యులు, స్థానిక భక్తులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి ఆయా ఆలయాల్లో కల్యాణం నిర్వహిస్తారు. సోమవారం తీర్థం జరుగుతుంది. ఈ ఆలయానికి కోనసీమ ప్రాంతం నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి వస్తారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

మామిడికుదురు: శోభకృత్ నామ సంవత్సరం మార్గశిర శుద్ధ పంచమి శుభ ముహూర్తంలో ఆదివారం రాత్రి సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ కల్యాణాన్ని ఆద్యంతం కమనీయంగా నిర్వహించారు. మొగలికుదురు, పాశర్లపూడిబాడవ, పెదపట్నం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువలా జరిపించారు. కల్యాణంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామి వారి ఆలయాలను విద్యుత్ దీపాల వెలుగులతో శోభాయమానంగా అలంకరించారు. షష్ఠిలో భాగంగా ఆయా ఆలయాల వద్ద అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

రాజోలు: కడలి కపోతేశ్వరస్వామి ఆలయంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కాకాని వెంకట సత్యకృష్ణకుమార్, రుద్రపాక కల్యాణశర్మల ఆధ్వర్యంలో శైవాగమోక్త ప్రకారం స్వామి వారి కల్యాణం తంతు జరిగింది. తొలుత స్వామి వారిని బాజాభజంత్రీలు, మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయ కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వేదమంత్రోచ్చారణలతో రాత్రి 7.01 గంటల శుభ ముహూర్తంలో స్వామి వారి కల్యాణం వేడుక ప్రారంభించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అరవ జగన్నాథం, ఈఓలు సత్యనారాయణరాజు, బొక్కా వీర వెంకటేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు కాదంబరి గోపాలకృష్ణమూర్తి, వాసంశెట్టి దుర్గాలక్ష్మీప్రసన్న, తాడివలస రామాంజనేయులు, ధనాల పవన్, దీపాటి సుజాత, కడలి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: అయినవిల్లి, తొత్తరమూడి, శానపల్లిలంక, వెలువలపల్లి గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొత్తరమూడిలో సుబ్రహ్మణ్యస్వామికి ఆదివారం రాత్రి వైభవంగా కల్యాణం నిర్వహించారు. స్వామికి వేదపండితులు కల్యాణమహోత్సవాలు జరిపారు.

ఆత్రేయపురం: గ్రామంలో వేంచేసిన వల్లీ, దేవసేన సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. నూతన దంపతులు సంతానం ప్రాప్తి కోసం కుజ, నాగ దోష నివారణ కోసం ప్రతి మంగళ, శుక్రవారాలు స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. సంతానం ప్రాప్తించిన భక్తులు స్వామికి పటికబెల్లం, నగదు నాణేలు మొక్కుగా చెల్లించడం ఇక్కడ ఆనవాయితీ. ఉదయం అభిషేకాలు, మధ్యాహ్నం గ్రామోత్సవం, సాయంత్రం కల్యాణం నిర్వహించనున్నారు. అభిషేకాలు చేయించుకునే వారు రూ.125 చెల్లించి గోత్ర నామాలతో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవం



పెన్షనర్ల పితామహుడు నకారా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తాలూకా సంఘ నాయకులు



కొత్తపేటలో పెన్షనర్లను సత్కరిస్తున్న సంఘ కార్యవర్గ సభ్యులు

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక తాలూకా పెన్షనర్ల సంఘ భవనంలో సంఘ ప్రధాన కార్యదర్శి అజ్జరపు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో అసోసియేట్ ప్రెసిడెంట్ మాకే నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ పి.రాజేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పెన్షనర్ల సంఘ వ్యవస్థాపకుడు డీఎల్ నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ఇక్కడ ప్రభుత్వ పెన్షనర్లు సంఘటితంగా ముందుకు వెళుతూ 'ఐకమత్యమే మహాబలం' అని నిరూపించారన్నారు. ఈ సంఘానికి ప్రత్యేక భవనం నిర్మించుకుని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సంఘ సభ్యులు ఉండవిల్లి శివావిష్ణురావు రూ.40 వేలు, కొపెల్ల సత్యవతి రూ.10 వేలు సంఘానికి విరాళంగా సమర్పించారు. అనంతరం 1944-45లో జన్మించి, సంఘ సభ్యులుగా ఉన్న పెన్షనర్లు దాట్ల సూర్యనారాయణరాజు, ఏఎల్ నారాయణ, ఎంకే విశ్వేశ్వరరావు, గుమ్మడి ఇంద్రయ్య, మిర్తిపాటి సుబ్రహ్మణ్యం, డీఎల్ఎస్ సోమయాజులు, పప్పుల సత్యనారాయణ, ఉమ్మిడిశెట్టి బాపిరాజులను వేద మంత్రాల నడుమ సంఘ సభ్యులు, వారి బంధు మిత్రులు వివిధ రీతుల్లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం జాయింట్ సెక్రటరీ కాశి రాజేంద్రప్రసాద్, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు దొమ్మేటి వెంకట్రావు, జాయింట్ సెక్రటరీ కోట్ల విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: పెన్షనర్స్ దినోత్సవాన్ని ఆదివారం రాజోలు తాలూకా పెన్షనర్ల భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. సీనియర్ పింఛన్‌దారులను ఘనంగా సన్మానించారు. అలాగే ఇటీవల పదవీవిరమణ పొందిన 49 మందికి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేట్ అధ్యక్షుడు జి.వి.సత్యనారాయణ అధ్యక్షతన సమావేశంలో ట్రెజరీ సీనియర్ ఎకౌంటెంట్ రమేష్ పాల్గొని పింఛన్‌దారులకు ఎదురవుతున్న పలు సమస్యలపై అవగాహన కల్పించారు. తొలుత పెన్షనర్ల పితామహుడు డి.ఎస్.నకారా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి నరసింహరావు, ఐ.సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగుపడిన పేదల జీవన ప్రమాణాలు

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- పలివెలలో గడప గడపకూ మన ప్రభుత్వం



పలివెలలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ సుపరిపాలనలో నిరుపేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని పలివెల గ్రామంలో రెండోరోజు ఆదివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంట్లో సభ్యులకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వారికి వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామంలో వీధివీధినా జగ్గిరెడ్డికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలనలో అవినీతి రహిత పాలన అందిస్తున్నామని, లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా సంక్షేమ లబ్ధి చేకూరుస్తున్నామని అన్నారు. ఈ ప్రభుత్వంలో లబ్ధి పొందితేనే మళ్లీ మాకు ఓటు వేయండి.. అని చెప్పిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనన్నారు. సీఎం జగన్, వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రజాభిమాన ఉప్పెనలో ప్రతిపక్ష టీడీపీ కూటమి గల్లంతు కావడం ఖాయమని జగ్గిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రానున్నకాలంలో మరింతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జగన్ ప్రభుత్వం వల్లే సాధ్యమని అన్నారు. కార్యక్రమాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఎంపీటీసీ గునిపే శ్యామల, పీఏసీఎస్ అధ్యక్షులు పొనుగుపాటి సత్యనారాయణ, ముసునూరి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తులా సూరిబాబు, దేవస్థానం చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబా, సర్పంచ్ రెడ్డి చంటి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లవరపు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని అరుదైన ఘనత



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న ఉపాధ్యాయిని అరుణకుమారి

మలికిపురం: మండలంలోని మేడిచర్లపాలెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని గుబ్బల అరుణకుమారి అరుదైన ఘనత సాధించారు. శ్రీకాకుళంలో రెండు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి గణిత దినోత్సవంలో ఆన్‌లైన్ ప్రజెంటేషన్‌లో ఫస్ట్ ప్రైజ్, టీఎల్ఎం ప్రజెంటేషన్‌లో సెకండ్ ప్రైజ్ గెలుచుకున్నారు. అక్కడి వేదికపై గణిత మేధావి లక్కోజు సంజీవరాయ శర్మ కుమారుడు, కోడలు చేతుల మీదుగా ప్రసంశా పత్రాలను అందుకున్నారు. జెడ్పీహెచ్ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు కె.సాయిబాబు, సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి, ఎంపీటీసీ ముత్యాల సాయిరాం ఆమెను అభినందించారు.

జగ్గిరెడ్డి గెలుపును కాంక్షిస్తూ అయినవిల్లికి పాదయాత్ర



అయినవిల్లిలో సోషల్ మీడియా వారియర్స్‌తో కలసి స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వరుసగా మూడోసారి గెలుపొందాలని, 2024లో వైఎస్సార్ సీపీ తిరిగి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సుమారు 150 మంది నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా వారియర్స్ రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం వరకు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రను జిల్లా పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పాటి శివకుమార్, రావులపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు కర్రి అశోక్‌రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. తొలుత భక్తాంజనేయ స్వామిని దర్శించుకుని స్థానిక సెంటర్‌లో ఉన్న మాజీ సీఎం వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నాయకులు పాదయాత్ర ప్రారంభిచారు. రావులపాలెం నుంచి మొదలై వెదిరేశ్వరం శివారు జగ్గిరెడ్డికాలనీ, పెంకులపాటి గరువు, మందపల్లి, వానపల్లి గ్రామాల మీదుగా అయినవిల్లి వరకూ సుమారు 27 కిలోమీటర్ల పాదయాత్ర సాగింది. మార్గ మధ్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వారిని కలసి అయినవిల్లి ఆలయం వరకూ కలసి నడిచారు. వారితో కలసి విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నా గెలుపును ఆకాంక్షిస్తూ, వైఎస్సార్ సీపీ జయకేతనం ఎగురవేయాలని పాదయాత్ర చేసిన సోషల్ మీడియా విభాగం సభ్యులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యవర్మ తదితరులు ఉన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మళ్లీ గెలవాలని ఆకాంక్షిస్తూ పార్టీ సోషల్ మీడియా సభ్యులు 200 మంది పాదయాత్రగా వచ్చి అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితులు ఆశీర్వచనం అందచేసి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. అనంతరం సభ్యులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించారు. స్వామి అన్నప్రసాద ట్రస్ట్‌కు రూ.25,000 విరాళంగా అందజేశారు.

కలవరపెడుతున్న వాతావరణం

మామిడికుదురు: రెండు రోజుల నుంచి వాతావరణంలో ఏర్పడిన మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి. దట్టమైన మేఘాలతో వాతావరణం గంభీరంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను కారణంగా కురిసిన భారీ వర్షం రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. ఆ చేదు అనుభవాల నుంచి ఇప్పుడిప్పుడే రైతులు బయటపడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మేఘాలు రైతులను కంగారు పెట్టిస్తున్నాయి. సార్వా వరి పంట 50 శాతం మాత్రమే మాసూళ్లు జరిగింది. మిగిలిన పంట కొంత పనలపై ఉంది. మరి కొంత కుప్పలుగా వేశారు. కోత కోయాల్సి ఉంది. ఈ తరుణంలో వర్షం పడితే మిగిలిన కొద్దిపాటి పంట తుడిచి పెట్టుకు పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తాగునీటి సమస్యలకు చెక్

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాజోలు నియోజకవర్గంలో తాగునీటి సమస్యలకు చెక్ పెట్టామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని శంకరగుప్తం, అడవిపాలెం పంచాయితీల్లో 40 వేల లీటర్ల తాగునీటి ట్యాంకుల నిర్మాణాలకు ఆదివారం ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఆయా సభల్లో మాట్లాడారు. ఉప్పునీటి తీవ్రత అధికంగా ఉండే సముద్ర తీర గ్రామాల్లో తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో మెరుగుపడిందన్నారు. ప్రతి ఇంటికీ పైప్‌లైన్‌లు వేసి దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ ముత్యాల కాశి, సర్పంచ్‌లు కొల్లు అనంతలక్ష్మి, రాపాక ఆనందరావు, ఎంపీటీసీలు ఆచంట మాణిక్యం, మానుకొండ ప్రమీల, పప్పొప్పుల మల్లు, చింతా కుమారరాజు, సాగిరెడ్డి నారాయణరావు, కొల్లు నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన పేదల కల



లక్కవరంలో ఇళ్ల పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: సీఎం జగన్ కృషితో పేదల సొంతింటి కల నెరవేరిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని లక్కవరంలో జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పేదవాడి సొంత ఇంటి కల నెరవేరాలన్న దృఢ లక్ష్యంతో సీఎం జగన్ జిరాయితీ భూములను కొని పేదలందరికీ ఇళ్ల పట్టాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మాజీ సీఎం వైఎస్సార్ తరువాత పేదలందరికీ ఇళ్లు ఉండాలని లక్ష్యంతో సీఎం జగన్ వారికి ఇళ్ల స్థలాలను అందించారన్నారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, విద్యుత్, వంటి అన్ని సౌకర్యాలను వారికి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జీవీఎల్ నరసింహారావు, పార్టీ నాయకులు మంగెన సింహాద్రి, కేవీఎస్ఎన్‌రాజు, ఎమ్మెల్యే తనయుడు రాపాక వెంకట్రామ్, ముదునూరి విష్ణుమూర్తిరాజు, శ్రీనివాసరాజు, చిట్టిరాజు, కొడవటి దొరబాబు, జి.సుమలత, వీఆర్ఓ ఆనందరావు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై ప్రజల సంతృప్తి



లక్కవరంలో మహిళకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరూ అలర్ట్‌గా ఉండాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు సూచించారు. మలికిపురం మండలం లక్కవరంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు ఎమ్మెల్యేకు ప్రభుత్వం తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఏ మూలకు వెళ్లినా సీఎం జగన్ పాలనకు విశేష ఆదరణ లభిస్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు వెంకట్రామ్, నాయకులు మంగెన సింహాద్రి, గ్రామ శాఖ అధ్యక్షులు ముదునూరి విష్ణుమూర్తిరాజు, కొడవటి దొరబాబు, ఉలిశెట్టి లక్ష్మణరావు, ముదునూరి శ్రీనివాసరాజు, దారా సత్తిబాబు, కొల్లాబత్తుల అశోక్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ అధికారులు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



మలికిపురంలో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మలికిపురం: గత 30 ఏళ్ల క్రితం స్థానిక ఎంవీఎస్‌జేఎస్ అండ్ ఎస్ఆర్‌వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో 1986-89లో డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. గ్రూప్ అడ్మిన్ కుడుపూడి బేబీ పద్మకుమారి ఆధ్వర్యంలో కె.వీరస్వామి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన పూర్వ విద్యార్థులు తమ ఆనందాలను వ్యక్తం చేశారు. గత మూడేళ్ల నుంచి తాము కలుసుకుంటున్నట్లు తెలిపారు. తమ బ్యాచ్‌లోని సభ్యులంతా కలసి కొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎఫ్‌డీటీ సంస్థ అందరికీ దేవాలయం లాంటిదని ఇందులో చదువుకున్న వారంతా ఉన్నత స్థాయిలో ఉన్నారని పేర్కొన్నారు. చదువుతోనే ఈ అభివృద్ధి సాధ్యమైందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించి వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలన్నారు. అనంతరం వినోద కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక జూనియర్ కళాశాల, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.సతీష్, శ్రీనివాసరాజు, గ్రూప్ అడ్మిన్ కుడుపూడి బేబీ పద్మకుమారిలను సమావేశంలో శాలువా, పూలదండ, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రూపు భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో గ్రూప్ ఆర్గనైజింగ్ కోఆర్డినేటర్ కేఎస్‌సీ ప్రసాద్, కె.వెంకటరత్నం, కె.మహేష్, జి.శ్రీరామ్, కె.మహేశ్వరి, టి.సుశీలాదేవి, కె.శ్రీనివాసరావు, కె.చంటి తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గం అందరికీ ఆదర్శం

కొత్తపేట: లోక రక్షకుడు ఏసుక్రీస్తు చూపిన శాంతి, సహనం సమాజంలో అందరికీ ఆదర్శం కావాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని పలివెల చేరేపాలెం గాడ్స్ లవ్ మిషన్ చర్చిలో ఆదివారం చర్చి పాస్టర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన క్రైస్తవులకు, క్రీస్తు భక్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ న్యూఇయర్ క్యాలెండర్లను జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. ఆయన చేతుల మీదుగా 50 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ పొనుగుపాటి సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు తులా సూరిబాబు, ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబు, పార్టీ నాయకుడు మల్లవరపు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోతుకుర్రులో రూ.6 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: మండలంలోని పోతుకుర్రులో డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదివారం శ్రీకారం చుట్టారు. రూ.6 లక్షలతో ఈ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కమిడి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు నరసింహరాజు, పుల్లంశెట్టి, పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

రోటరీ చెస్ పోటీల్లో విజేతగా వెంకటరమణ



బంగారు పతకం అందుకుంటున్న చెస్ విజేత వెంకటరమణ

రాజోలు: నరసాపురం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోటరీజోన్-4 స్పోర్ట్స్ మీట్‌లో చెస్ పోటీల్లో విజేతగా రాజోలు రోటరీక్లబ్ సభ్యురాలు యెనుముల వెంకటరమణ విజేతగా నిలిచారు. ఆదివారం ఈ మేరకు ఆమెను రాజోలు రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడిద కవీంద్ర, చిట్టినీడి లక్ష్మణరావులు అభినందించారు. రోటరీజోన్-4 పరిధిలో చెస్ పోటీల్లో విజేతగా నిలిచిన వెంకటరమణకు నరసాపురం క్లబ్ ప్రతినిధులు ప్రశంసాపత్రం, బంగారు పతకాన్ని అందజేశారు. సమాజ సేవల్లో నిమగ్నమైన రోటరీక్లబ్ సభ్యులకు స్పోర్ట్స్ నిర్వహించిన నరసాపురం రోటరీక్లబ్ నిర్వాహకులను అభినందించారు.